విలేకరులు కావలెను
తెలుగు దినపత్రిక రంగంలో నూతన ఒరవడితో ప్రజల పక్షాన
నూతన శకంతో సంచలనం సృష్టించబోతున్న మా తెలుగు దినపత్రిక
వినూత్న తరహాతో నిజాన్ని నిర్భయంగా సమాజ హితంకై పోరాటమే మా లక్ష్యంగా
ప్రచురించబడుతున్న మా పత్రికయందు పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా
పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్.సి. ఇంచార్జిలు,
మండలాలవారిగా రిపోర్టర్లు కావలెను. నూతన తరం మల్టిమీడియా మీ సత్తాకై
పాత్రికేయులను తీర్చిదిద్దడం కొరకు మా నేటి ఇజం పత్రిక
దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.
9000967435
9618889897
అర్హతలు :
- తెలుగులో రాయగల నేర్పు
- లోకజ్ఞానం వర్తమాన వ్యవహారాల పై పట్టు
- సమాజాభివృద్ధి కోసం పాటు పడాలన్న తపన

# నేటి ఇజం

NETI EJAM TELUGU DAILY.NET డిజిటల్ తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 23 హైదరాబాద్ ఎడిటర్: రామడుగు కొమురయ్య మంగళవారం 12-08- 2025 పేజీలు : 4 వెల : రూ. 4/-



## భారీ ట్రాఫిక్ జామ్.. అంబులెన్స్‌లోనే పోయిన ప్రాణం..!

2వ పేజీలో...

- మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో చెట్టు కొమ్మ పడి తీవ్రంగా గాయపడిన ఛాయా పురవ్ అనే మహిళ
- జిల్లాలో ట్రామా సెంటర్ లేకపోవడంతో ముంబైకి తరలింపు
- జాతీయ రహదారి-48పై గంటల తరబడి నిలిచిపోయిన అంబులెన్స్
- మరో 30 నిమిషాల ముందు వస్తే బతికేవారని వైద్యుల వెల్లడి
- తన భార్య నాలుగు గంటల పాటు నొప్పితో అరుస్తూ విలవిల్లాడిందన్న భర్త



## ఎంపిలకు మరో కొత్త నివాస సముదాయం

### కొత్త సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, : ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఎంపీల నివాస సముదాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి మోడీ ఎంపీల ఫ్లాట్లు- ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇకపై ఎంపీల కొత్త నివాసాల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోరని.. పనిపై ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అద్దె భవనాల నుంచి పని చేసే మంత్రిత్వ శాఖల అద్దె ఏటా రూ.1,500 కోట్లు- ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే ఎంపీలకు కూడా సరైన నివాసాలు లేకపోవడంతో ప్రభుత్వ ఖర్చులు కూడా చాలా ఎక్కువగా అవుతున్నాయని వెల్లడించారు. నివాసాల కొరత ఉండడంతో 2014 నుంచి 2024 వరకు దాదాపు 350 మంది ఎంపీలకు కొత్త నివాసాలు నిర్మించినట్లు- తెలిపారు. తాజాగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో 184 మందికి పైగా ఎంపీలు కలిసి నివాసం ఉండొచ్చని చెప్పారు. 2వ పేజీలో...



## తెలంగాణలో 13 నుంచి అతి భారీ వర్షాలు

### హెచ్చరికల జారీ

2వ పేజీలో...

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- దాని ప్రభావంతో 13 నుంచి 16 వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ
- నేడు, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు



## రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు
- 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లాలో రేవంత్ పై కేసు నమోదు
- కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 11, : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పరిధిలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారంటూ రేవంత్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ పిటిషన్ పై ధర్మాసనం పలుమార్లు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## సిఎం రేవంత్‌తో పిసిసి చీఫ్ భేటీ

### బిసి రిజర్వేషన్లు, తాజా రాజకీయాలపై చర్చ



2వ పేజీలో...



## సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

### రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం ద్వారా సాయం మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష చెక్కు అందించిన భట్టి

హైదరాబాద్, : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2వ పేజీలో...



## కాగ్ త్రైమాసిక నివేదిక ఆదాయం తగ్గడంపై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ తైమ్రాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీ-ల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి తైమ్రాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20, 266 కోట్లు- అప్పగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడుతా రో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా..? అని కేటీఆర్ నిలదీశారు.



## ఎమ్మెల్సీ కవితది వ్యూహాత్మకమా..?

### సొంత పార్టీతోనే ఢీ అంటే ఢీ

2వ పేజీలో...

హైదరాబాద్, ఆగస్టు 11, : కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ మహిళా నాయకురాలు, తెలంగాణ ఉద్యమ నాయకురాలు. గులాబీ పార్టీ నుండి ఎంపీగా గెలిచిన మహిళా నేత. ప్రస్తుతం ఆ పార్టీ నుండే ఎమ్మెల్సీగా పని చేస్తున్నారు. అంతేకాకుండా, స్వయానా బీఆర్ఎస్ చీఫ్ కూతురుగా పార్టీలో గుర్తింపు పొందిన నేత. అయితే గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయ పరిణామాలకు తగ్గట్టుగా తనదైన రాజకీయ భాష్యాన్ని తన చర్యల ద్వారా కవిత చెప్పకనే చెబుతున్నారు. సొంత పార్టీతోనే ఢీ అంటే ఢీ అనేలా సవాల్ విసురుతున్నారు.
వ్యూహాత్మక కార్యాచరణతో గులాబీ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.



2వ పేజీలో...

## భాగ్యనగరం.. బాగుపడేదెప్పుడూ..?

- వర్షం పడితే.. నగర ప్రజల హృదయాల్లో భయం
- ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?

హైదరాబాద్, ఆగస్టు 11, : అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది "ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?" అన్న ఆందోళన. భాగ్యనగరం (హైదరాబాద్) వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి. అరగంట వానకే రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి, మాన్‌హోల్స్ కనిపించకుండా పోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు గంటల తరబడి కొనసాగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్నా, దానికి శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు. ఈ దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి.. హైదరాబాద్ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా పాతది మరియు విస్తరిస్తున్న నగర అవసరాలకు సరిపోవడం లేదు. జనాభా పెరగడం, కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల నీటి మళ్లింపు సరిగ్గా జరగడం లేదు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా, వాటికి అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

# భాగ్యనగరం... బాగుపడేదెప్పుడూ..?



కాలక్రమేణా నాలాలు, చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగి, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. వర్షాకాలానికి ముందు డ్రెయినేజీ క్లీనింగ్, రోడ్ల మరమ్మతులు చేస్తామనే వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి, వరదలు సంభవిస్తున్నాయి.ప్రతి వర్షాకాలం భాగ్యనగరం మునిగిపోకుండా ఉండాలంటే తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలను అమలు చేయాలి. నగర జనాభా, విస్తరణకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడం, పాత వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం. నాలాలు, చెరువుల చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంది. భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాజెక్టులలో డ్రెయినేజీ, నీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా చేర్చాలి. భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే, ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం తప్పనిసరి. వర్షం అంటే భయం కాకుండా, ఆనందం కలిగించే రోజు రావాలంటే, ఈ సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనడం అవసరం. లేకపోతే, వర్షాకాలంలో నగర ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి.

మొదటిపేజీ తరువాయి...

నరకం చూపించిన వాన: హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా కురిసిన వానకు జన జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అడుగు కదలడానికి గంటలు పట్టింది. హైటెక్ సిటీ ప్రాంతంలో అయితే మరింత నరకప్రాయం. ఎక్కడికక్కడ అధికారులు వెంటనే వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ మాత్రం ముందుకు కదల్లేరు. అర్ధరాత్రి వరకు వాహనదారులు రోడ్లపైనే జాగారం చేశారు. హైటెక్ సిటీ నుంచి హయత్ నగర్ వరకు అటు గాజులరామారం వరకు ఇటు శంషాబాద్ వరకు ఎక్కడ చూసినా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవైపు దంచి కొడుతున్న వాన మరోవైపు ముందుకు కదలని ట్రాఫిక్. నిజంగా ప్రయాణికులు బాధ వర్ణాణాతీతం. రోడ్డుపై పారుతున్న వరద నీటిలో కొన్ని కార్లు కొట్టుకు పోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రియల్ టైంలోపని చేసే అధికారులు కనిపించడంలేదని నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఆఫీస్ నుంచి వచ్చే వాళ్లది ఒక బాధ అయితే ఆఫీస్‌కు నైట్ షిఫ్టులకు వెళ్లే వాళ్లదిమరో బాధ. షిఫ్టు టైం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటోలు క్లిక్ చేసి చలానాలు రాసే డిపార్ట్మెంట్‌గా ట్రాఫిక్ విభాగం పేరు తెచ్చుకుందే తప్ప రియల్ టైంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడుతున్నారు. ఇలా వర్షంలో చిక్కుకుపోతామని ఆఫీసుల్లోనే వాహనాలు వదిలి మెట్రోను ఆశ్రయించిన వారికి అక్కడ క్రౌడ్ చూసి బిత్తర పోయారు. అన్ని మెట్రో టెర్మినల్స్‌లో కూడా భారీ క్యూలు కనిపించాయి. వచ్చిన మెట్రోలు కిక్కిరిసిపోయాయి. ఏదోలా ఇంటికో ఆఫీస్‌కో చేరుకోవాలన్న ఆశతో నగరవాసులు మెట్రోలో ఇబ్బందిపడుతూనే ప్రయాణం చేశారు. కనీసం నిలబడేందుకు కూడా జాగా లేక సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించే వారిది మరో బాధ. క్యాబ్‌లు, ఆటోలు గంటల తరబడి బుక్ కాలేదు. అయినా కొందరు డ్రైవర్ల వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. రిజెక్టు కొట్టారు. ఇలా అన్ని వైపుల నుంచి నగర వాసులను వాన తెగ ఇబ్బంది పెట్టేసింది.

# భారీ ట్రాఫిక్ జామ్..అంబులెన్స్‌లోనే పోయిన ప్రాణం..!

మొదటిపేజీ తరువాయి...

ముంబయి : ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ భారీ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోవడంతో, ఓ మహిళ మార్గమధ్యంలోనే నరకయాతన అనుభవించి ప్రాణాలు విడిచింది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన, అక్కడి వైద్య సదుపాయాల కొరతను, జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రతను కళ్లకు కట్టింది.

వివరాల్లోకి వెళితే.. పాల్ఘర్ జిల్లాలోని మధుకర్ నగర్‌కు చెందిన ఛాయా పురవ్ (49) అనే మహిళపై జులై 31న ఇంటి సమీపంలో ఒక చెట్టు కొమ్మ విరిగిపడింది. ఈ ఘటనలో ఆమె తల, పక్కటెముకలు, భుజాలకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, పాల్ఘర్ జిల్లాలో అత్యవసర చికిత్స అందించే ట్రామా కేర్ సెంటర్ అందుబాటులో లేదు. దీంతో స్థానిక వైద్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం 100 కిలోమీటర్ల దూరంలోని ముంబైలోని హిందూజా ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

సాధారణంగా ఈ ప్రయాణానికి రెండున్నర గంటల సమయం పడుతుంది. దీంతో వైద్యులు ఆమెకు అనస్థీషియా ఇచ్చి, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అంబులెన్స్‌లో ముంబైకి పంపారు. ఆమె భర్త కౌశిక్ కూడా అంబులెన్స్‌లోనే ఉన్నారు. అయితే, జాతీయ రహదారి-48పై వారు ఊహించని ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయారు. మూడు గంటలు గడిచినా వారు సగం దూరం కూడా ప్రయాణించలేకపోయారు. సాయంత్రం 6 గంటల సమయానికి అనస్థీషియా ప్రభావం తగ్గడంతో ఛాయా పురవ్ తీవ్రమైన



నొప్పితో విలవిల్లాడారు. ఆమె పరిస్థితి విషమించడంతో, అంబులెన్స్ సిబ్బంది గమ్యస్థానానికి మరో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మీరా రోడ్‌లోని ఆర్బిట్ ఆసుపత్రికి రాత్రి 7 గంటల సమయంలో తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు, ఛాయా పురవ్ అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మరో అరగంట ముందుగా ఆసుపత్రికి తీసుకొచ్చి ఉంటే ఆమె ప్రాణాలు కాపాడగలిగేవాళ్లమని వైద్యులు తెలిపినట్లు భర్త కౌశిక్ కన్నీటిపర్యంతమయ్యారు.

**నాలుగు గంటల నరకయాతన: భర్త ఆవేదన**

“నాలుగు గంటల పాటు ఆమె నొప్పితో అరుస్తూ, ఏడుస్తూ కనిపించింది. త్వరగాఆసుపత్రికి తీసుకెళ్లమని వేడుకుంది.కానీమేం నిస్సహాయులమైపోయాం” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై గుంతలు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వల్ల ట్రాఫిక్ మరింత పెరిగిపోయిందని వాపోయారు. ఈ ఘటన పాల్ఘర్‌లో వైద్య సదుపాయాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తుచేసింది.

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచించ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టు-కోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. డిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-చిల్లపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

మంథని ప్రతినిధి, ఆగస్టు 11: ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని 7వ తరగతి పిల్లల ఇంగ్లీష్ రీడింగ్ స్కిల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.పిల్లలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపు పై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకోవడం కూడా రావాలని ఆ దిశగా మన బోధన ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో గేట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని , అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్



తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట హెడ్మాస్టర్ నరసింహా రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# ఎంపిలకు మరో కొత్త నివాస సముదాయం

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో కొత్త నివాస సముదాయాన్ని నిర్మించారు. -టైప్-ఎ౭లో భాగంగా 184 ఫ్లాట్లతో బహుళ అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు. సోమవారం ఈ నివాసాన్ని ప్రారంభించే ముందు ప్రాంగణంలో సింధూర మొక్కను మోడీ నాటారు. అనంతరం కార్మికులతో సంభాషించారు. ప్రతీ ఫ్లాట్ చాలా విశాలంగా నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ భవనం అల్యూమినియం షట్టరింగ్‌తో కూడిన మోనోలిథిక్ కాంక్రీటును ఉపయోగించి నిర్మించారు.

# సిఎం రేవంత్‌తో పిసిసి చీఫ్ భేటీ

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, : తాజా రీజకాయ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మెజారిటీ- నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు- సమాచారం.

# ఎమ్మెల్సీ కవితది వ్యూహాత్మకమా..?



మద్యం కుంభకోణం ఆరోపణలతో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కవిత తన సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు రావడం, ఆ తర్వాత మీడియా సమావేశంలో తన లేఖను బయటపెట్టిన వారి పేర్లు వెల్లడి చేయాలని పార్టీని డిమాండ్ చేయడం తెలిసిందే. సమయం, సందర్భం చిక్కినప్పుడల్లా గులాబీ ముఖ్య నేతలపై కవిత రాజకీయ విమర్శలు చేస్తూనే ఉన్నారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని బహిరంగంగానే మీడియా ముందు కవిత తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.అంతటితో మౌనంగా ఉండని కవిత, తన ఆధ్వర్యంలో నడిచే తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే దిశగా పలు చర్యలు చేపట్టారు. మరోవైపు, కాళేశ్వరం కమిషన్ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇందిరా పార్కు వద్ద ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ పార్టీ చేయనిది తాను కేసీఆర్ కోసం ఈ ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించి, పార్టీకి, పార్టీ కార్యకర్తలకు తనదైన శైలిలో రాజకీయ సందేశం పంపారు. ఆ తర్వాత బీసీ ఉద్యమ కార్యాచరణను ఎత్తుకొని మరోసారి ఇందిరా పార్కు వద్ద ధర్నా చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అనుమతి లేకుండానే తాను ఆయా రాజకీయ పార్టీల నేతలను కలుసుకుని మద్దతు కోరడం విశేషం. ఈ చర్యలతోనే కవిత తన సొంత దారి తాను చూసుకుంటున్నానన్న సందేశం చెప్పకనే చెప్పారు.బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాసిన లేఖ బయటపడిన నాటి నుండి కవిత

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ భవన్ గడప తొక్కలేదు. అంతేకాదు, కేసీఆర్ నుండి కూడా ఎలాంటి ఆహ్వానం రాలేదు. చివరకు ఫాంహౌస్ నుండి కాళేశ్వరం కమిషన్ ఎదుటకు కేసీఆర్ బయలుదేరే సమయంలో కూడా కవిత దూరం దూరంగానే తండ్రిని ఫాలో అవ్వడం, మీడియాకు రిలీజ్ చేసిన దృశ్యాల్లో కనిపించడం విశేషం. అయితే అక్కడ ఏం జరిగిందన్నది మనం చెప్పలేం కానీ, రాజకీయ చతురుడైన కేసీఆర్ మీడియా ముందు ఏం చేసినా దానికి ఒక లెక్క ఉంటుందని, మీడియా ముందు ఎవరితో మాట్లాడినా, భుజం మీద చేయి వేసినా కూడా ఒక లెక్క ఉంటుందన్న విషయం గులాబీ పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. అలాంటిది సొంత కూతురు, పార్టీలో సీనియర్ మహిళా నేత అయిన కవిత దూరంగా ఉండటం, కేసీఆర్ కూడా దూరంగా ఉన్నట్లు కనిపించడం కొట్టిపారేసే విషయం ఏమీ కాదు.ఇదిలా ఉంటే, కవిత ఇప్పటి వరకు చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో గులాబీ కండువా ఎక్కడా వేసుకోకపోవడం, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ ఈ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం గమనించాల్సిన మరో విషయం. కేసీఆర్ కోసం ఇందిరా పార్కు వద్ద చేసిన ధర్నాలోనూ తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతి కండువా కప్పుకొని పాల్గొన్నారు. ఆ తర్వాత బీసీ ఉద్యమంలోనూ తన కండువాతో పాటు, బీసీ ఉద్యమానికి సూచిక అయిన నీలి రంగు కండువా కప్పుకున్నారు. ఇక తాజాగా హెచ్ఎంఎస్ కార్మిక సంఘం నేతలతో జరిగిన సమావేశంలోనూ హెచ్ఎంఎస్ కండువా కప్పుకొని మీడియా ముందు కనిపించడం కూడా రాజకీయ సందేశంగానే చెప్పుకోవాలి. ఈ పరిణామాలన్నీ గమనిస్తే కవిత గులాబీ కండువాను దూరం పెట్టిందని తెలుస్తోంది.ఇక తాజా విషయానికి వస్తే, బీఆర్ఎస్ పార్టీ తనను ఒంటరి చేస్తోందని చెబుతున్న కవిత అందుకు తగ్గట్టుగా తన రాజకీయం ఏంటో చూపిస్తున్నట్లుంది. తెలంగాణలో సింగరేణి కార్మికుల ప్రభావం ఎక్కువే. చాలా నియోజకవర్గాల్లో వీరి ప్రభావం కనిపిస్తుంది. బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి తర్వాత టీజీబీకేఎస్ పదవి నుండి కవితను తప్పించారు. ఆ స్థానంలో కొద్ది రోజుల క్రితమే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ నియమించింది. ఈ పరిణామానికి కవిత కూడా దూకుడుగా స్పందిస్తుండటం చూస్తే ఢీ అంటే ఢీ అని బీఆర్ఎస్ కు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తుంది.ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి సంస్థకు అనుబంధంగా కార్మిక విభాగాన్ని పటిష్టం చేశారు. కొత్త శాఖలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఏ పార్టీతో సంబంధం లేని హెచ్ఎంఎస్ కార్మిక సంఘంతో భేటీ అయి వారితో కలిసి పని చేయనున్నట్లు ప్రకటించారు. ఇది చూస్తుంటే రానున్న రోజుల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగితే సింగరేణితో సహా ఆయా పారిశ్రామిక సంస్థల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాల ఓటమికి కవిత పని చేయాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇదే జరిగితే బీఆర్ఎస్ తో కవిత అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధపడినట్లే. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ లో ఎలాంటి రాజకీయ మార్పులు తెస్తాయో వేచి చూడాల్సిందే.బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీగా ఉంటూ, పార్టీ అనుబంధ కార్మిక సంఘాలు ఉన్నా, మరో పోటీ కార్మిక సంఘంతో కవిత చేతులు కలపడం అనేది పార్టీ లక్ష్మణ రేఖ దాటినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇది రాజకీయంగా బీఆర్ఎస్ ను బలహీనపరిచే చర్యగా అభివర్ణిస్తున్నారు. పార్టీని కాదని కవిత చేసిన ధర్నాలు ఒక ఎత్తయితే, మరో కార్మిక సంఘంతో కలిసి పని చేస్తానని చెప్పడం మరో ఎత్తు. ఇది నేరుగా పార్టీకి సవాల్ విసిరినట్లే అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ చర్యల ద్వారా తాను బలమైన నాయకురాలిని అన్న సంకేతాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇప్పటి దాకా అటు కేసీఆర్ కానీ, కేటీఆర్ కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం, కవితపై క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడం లేదా ఈ అసమ్మతిని తగ్గించేలా పిలిచి మాట్లాడకపోవడం అనేది వ్యూహమా లేక ఇది దీర్ఘకాలికంగా పార్టీకి నష్టం చేస్తుందా అన్నది మాత్రం వేచి చూడాలి.

# తెలంగాణలో 13 నుంచి అతి భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి...



హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ నెల 13 నుంచి 16 వరకు నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.అలాగే, నేడు, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిన్న నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో అత్యధికంగా 11.05 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

# అడుగడుగునా గుంతలు..!




**హైదరాబాద్,: ఒక పక్క వర్షాలతో నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. బండి బయటకు తీసి వెళ్లాలంటే వాహనదారుడి నడ్డి విరిగిపోతుంది.. అడుగడుగున గుంతలతో నగర వాసి ప్రయాణం దిన దిన గండంగా మారుతోంది. గంటల తరబడి ప్రయాణంతో రోడ్లపైనే గడుపుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

ఆది, సోమ అనే తేడా లేదు.. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యతో సతమవుతూ.. ఏం జీవితం రాబాబూ అంటూ నగర వాసి నిట్టురుస్తున్నాడు.. వర్షాకాలం వస్తుందని తెలుసు, వర్షం పడినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన తాత్కాలిక చర్యలు ఉంటాయి, కాని అధికార యంత్రాంగం మాత్రం తమ మొద్దు నిద్ర వీడడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. వారం రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాఖీపౌర్ణమి కావడంతో నగరం నుంచి బయటకు వెళ్లేవారు, బయట నుంచి నగరానికి వచ్చేవారితో రోడ్లన్ని రద్దీగా మారాయి. అసలే ట్రాఫిక్ దానికి తోడు రోడ్లన్ని ఎక్కడికక్కడ గుంతల మయంగా మారడంతో నగర పౌరుల ప్రయాణం క్షణ క్షణం గండంగా మారింది. రాత్రి 10.30 గంటల సమయంలో నగర వ్యాప్తంగా భారీ వర్షం కురియడంతో ఇక ట్రాఫిక్ ఎక్కడికక్కడే ఆగిపోయి సమస్య మరింతగా పెరిగిపోయింది. నగరంలో రోడ్డునెంబర్ 1 నుంచి మాసబ్‌ట్యాంక్‌కు వెళ్లాలంటే రాత్రి 11 గంటల సమయంలో గంటకుపైగా సమయం పట్టిందంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడికక్కడే గుంతలు!: నగరంలోని ప్రధాన రహదారులతో పాటు శివారులలోని ప్రధాన రూట్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కడకక్కడే ఏర్పడుతుంది. ఇందుకు ప్రధాన కారణం రోడ్లపై ఎక్కడి గుంతలు అక్కడే ఉంటున్నాయి, ఆయా గుంతలను కనీసం తాత్కాలికంగా పూడ్చీ వాహనాల వేగం పెంచాలనే ఆలోచన కూడా యంత్రాంగానికి లేకపోవడంతో వాహనదారులు ప్రతినిత్యం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలోను కొన్ని చోట్ల రోడ్లు కోతంకు గురయ్యాయి, ఐటీ కారిడార్‌లలోను రోడ్లపై గుంతలు పడ్డాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, సాగర్ రోడ్డు, ఉప్పల్ వంటి ప్రాంతాలలోని ప్రధాన రహదారులన్ని గుంతలతో నిండిపోతున్నాయి. బాలాపూర్ చౌరస్తా దాటగానే యూటర్న్ వద్దగత రెండు మూడు నెలలుగా రోడ్డంతా అధ్వాన్నంగా మారింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే అక్కడ సమస్య ఉంది. వర్షాకాలం రావడం, రెండు మూడు భారీ వర్షాలు కురవడంతో అక్కడ పరిస్తితి మరింత దారుణంగా మారింది. ఈ రూట్‌లోనే ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారితో వాహనాల రద్దీ ఉంటుంది. సుమారు రెండు నెలలవుతున్నా ఇక్కడ కనీస చర్యలు తీసుకొని వాహనాలు వేగంగా వెళ్లాలనే ఆలోచన యంత్రాంగం చేయదకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఒకే చోట కాకుండా ఉప్పల్, ఎల్బీనగర్‌లోని రోడ్లలోని ప్రధాన రహదారులపై ఇలాంటి పరిస్తితి నెలకొంది. అసలే భారీ వర్షాలు.. దానికి తోడు రోడ్లన్ని గుంతల మయంగా మారడంతో వాహనాల కదలిక ఎక్కడికక్కడే నెమ్మదించడంతో ఆ ప్రభావం ఇతర రహదారులపై కూడా పడుతుంది. దీంతో నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలపై ట్రాఫిక్‌లో చిక్కుకొని నరకం అనుభవించాల్సిన పరిస్థితి.

రోడ్ల పరిస్థితి అధ్వాన్నం: నగర వ్యాప్తంగా ఎక్కడ చూసిన దారి పొడవునా గుంతలు, కంకర తేలిన రోడ్లు, వానలేని సమయంలో దుమ్ము,దూళితో నిండిపోయిన రహదారులు కన్పిస్తున్నాయి. వర్షం కురిస్తే బురద రోడ్లపైకి వవస్తుంది, మరుసటి రోజుకు అది అక్కడే ఉంటుంది, ప్రధాన రహదారులలోని కొన్ని చోట్ల మాత్రం దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ అంతర్గత రోడ్లు, ఇతర రోడ్లలో మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, ఆమీర్‌పేట, సికింద్రాబాద్, ఉప్పల్, తార్నాక, హబ్సిగూడ, ముషీరాబాద్, రాంనగర్, కుత్బుల్లాపూర్, బాలానగర్, తదితర చోట్ల రహదారులు వర్షాలకు దెబ్బతినడం, మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో ఆ రోడ్లపై వెళ్లడం ఇబ్బందికరంగా మారిందంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్లపై వర్షం పడ్డ, రద్దీ సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది, వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్లలో అంతర్గత రహదారులలోకి వెళ్తుంటారు. ఇక అంతర్గత రహదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ రద్దీ ఏర్పడి పక్క రూట్లలోకి వెళ్లే ఎక్కడ ఏ గుంత ఉందో, ఎక్కడ ఏ మ్యాన్ హెూల్ తెరిచిందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. దీంతో అంతర్గత రహదారులలోకి వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకని చాలామంది కష్టమైనా సరే గంటల తరబడి ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గుంతల రోడ్లపై ప్రయాణంలో ఒళ్లు హూనం చేసుకోవాల్సి వస్తుందని, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో వాహన కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నామంటూ వాహనదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా గుంతల రోడ్లతో పాటు ఎక్కడికక్కడే ఇసుక, బురద మేటలు రోడ్లపై ఉండడంతో వాహనాలు స్కిడ్ అవుతున్నాయంటూ వాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అధిక స్క్రీన్ టైమ్‌తో పిల్లలకు గుండె జబ్బుల ముప్పు!



న్యూఢిల్లీ, : ఇటీవలి కాలంలో అందరూ టీవీలు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. గంటలకొద్దీ స్క్రీన్‌లపై గడిపితే ముఖ్యంగా పిల్లల్లో గుండె జబ్బుల ముప్పు పెరుగుతుందని డెన్మార్క్‌లోని కోపెన్‌హెగెన్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. 'జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్' కథనం ప్రకారం, కార్డియోమెటబాలిక్ వ్యాధులకు దారితీసే అంశాలకు, స్క్రీన్ టైమ్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించేందుకు వెయ్యిమంది పిల్లలపై సైంటిస్టులు అధ్యయనం చేపట్టారు. 10 ఏండ్లు, 18 ఏండ్ల పిల్లల స్క్రీన్ టైమ్, నిద్ర తీరులను పరిశీలించారు. 'ఎలక్ట్రానిక్ పరికరాలతో అధిక సమయం గడుపుతున్న పిల్లలు, టీనేజర్లలో కార్డియోమెటబాలిక్ వ్యాధులు వస్తున్నాయి. అధిక బీపీ, అధిక కొవ్వు, ఇన్సులిన్ నిరోధకత వంటివి తలెత్తే అవకాశముంది' అని నివేదిక పేర్కొన్నది. రోజువారీ స్క్రీన్ సమయం ప్రతి అదనపు గంట వ్యాధి ప్రమాదాన్ని పెంచుతున్నదని నివేదిక తెలిపింది.

## రైతు భీమా కొరకు దరఖాస్తు చేసుకోండి
### వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ

కమాన్ పూర్ ప్రజా క్రాంతి ఆగస్టు 11. కమాన్ పూర్ మండల పరిధిలోని అర్హత గల రైతులు రైతు భీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ కోరారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు జూన్ 5 వరకు వచ్చిన గతంలో రైతు బీమా చేసుకొని రైతులు మాత్రమే దరహాసు చేసుకోవాలని కోరారు. రైతు బీమా దరఖాస్తు కొరకు కావాల్సినవి ఈ విధంగా ఉన్నాయి దరఖాస్తు ఫారం పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ రైతు ఆధార్ జిరాక్స్ నామిని ఆధార్ జిరాక్స్ పూర్తి చేసి అందజేయాలని పేర్కొన్నారు. దీనికి అర్హత కలుగు రైతులు 14 ఆగస్టు 1966 నుండి 14 ఆగస్టు 2007 వరకు మధ్యలో పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇట్టి దరఖాస్తుల యొక్క చివరి తేదీ 13 ఆగస్టు 2025 వరకు స్థానిక కార్యాలయంలో లేక రైతు వేదికల్లో అందజేయాల్సిందిగా కోరారు. రైతు బీమా లో మార్పులు చేరుకుల కొరకు 12వ తేదీ చివరి తేదీ అని పేర్కొన్నారు.

## టమోటాకు తెగుళ్లు!



**- వర్షాల రాకతో తెగుళ్ల ఉధృతి**

**- కళ్యాణదుర్గం డివిజన్‌లో 15వేల ఎకరాలు సాగు**

కళ్యాణదుర్గం : అనంతపురం జిల్లాలో టమోటా రైతులను తెగుళ్ల కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం టమోటా ధర ఆశాజనకంగా ఉన్నా తెగుళ్లతో రైతులు కుదేలవుతున్నారు. పంట సాగు ప్రారంభం నుంచి వేలాది రూపాయల పెట్టుబడులను ఖర్చు చేశారు. తీరా కోత సమయానికి టమోటా కాయలకు మచ్చతెగుళ్లు రావడంతో పంట ఎందుకూ పనికి రాకుండా పోతోంది. ఈ మచ్చతెగుళ్లతో 70 శాతం పంట నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మచ్చతెగుళ్ల సోకిన కాయలను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. పండిన పంటలో 70 శాతం కాయలకు ఈ తెగుళ్లు ఉండడంతో రైతులకు కనీసం పెట్టు బడులకు కూడా వెనక్కు రావడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ తెగుళ్ల ఉధృతి మరింత ఎక్కువ అవుతోంది.

కళ్యాణదుర్గం డివిజన్‌లో అత్యధికంగా సాగు: పండ్ల తోటల సాగులో అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం డివిజన్ రైతులు ముందు వరుసలో ఉన్నారు. టమోటా పంట జిల్లా వ్యాప్తంగా 10 డివిజన్‌లలో 18,750 ఎకరాలలో సాగైంది. ఇందులో సుమారు 15,220 ఎకరాలు కళ్యాణదుర్గం డివిజన్‌లోని ఆరు మండ లాల్లో సాగు జరిగినట్లు జిల్లా ఉద్యానవన అధికారులు చెబుతున్నారు.

ధరా ఆశాజనకంగా ఉన్నా నష్టమే..: ప్రస్తుతం దిగుబడి అందుతున్న టమోట 15కిలోల బాక్సు రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. మచ్చతెగుళ్లు లేని కాయలు నాణ్యతగా ఉంటే బాక్సు రూ.500 తగ్గకుండా ధర వస్తోంది. ధర బాగా ఉండడంతో రైతులు ఆనంద పడ్డారు. మచ్చతెగుళ్లు రావడంతో ఒక్కసారిగా రైతుల ఆశలు ఆవిరయ్యాయి. మచ్చ తెగుళ్లు ఉన్న కాయలను వ్యాపారులు కొనేందుకు కూడా ముందుకు రావడం లేదు. కళ్యాణదుర్గం మార్కెట్, అనంతపురం, కడప, బెంగళూరు, హైదరాబాదు, కోలార్ పట్టణానికి టమోటాను రైతులు తరలించి అమ్మకాలు చేస్తున్నారు. అంతదూరం రవాణా ఛార్జీలు, కూలీల ఖర్చులు పోను రైతులకు నామమాత్రపు ఆదాయమే లభిస్తోంది. ఎలాంటి తెగుళ్లు రాకుంటే 15 కిలోల బాక్సులు ఒకఎకరాకు వెయ్యిదాక దక్కుతాయి. ప్రస్తుత రేటు ప్రకారం సరాసరి బాక్సుధర రూ.350 వేసుకున్నా ఎకరాకు రూ.3లక్షలకు పైగానే ఆదాయం వస్తుంది. మచ్చతెగుళ్లు కారణంగా 70 శాతం పంటను వ్యాపారులు బయట పడేయడంతో రూ.70 వేలకు మించి రైతుకు రావడం లేదు.

## సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ

విజయవాడ, : మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చు అని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒల్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై రివ్యూ చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో... అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ ( ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామన్నారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు వివరించారు.

## ఆర్మీ జడ్జి అడ్వకేట్ నియామకాల్లో లింగవివక్ష




**కేవలం పురుషులకే అన్న నిబంధనపై ఆగ్రహం**

**తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ, : భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. కేవలం పురుషులకే వీటిని రిజర్వ్ చేయడాన్ని సుప్రీం తప్పు పట్టింది. ప్రస్తుత విధానాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం.. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇలాంటి విధానాలను అనుసరిస్తే ఏ దేశం భద్రంగా ఉండబోదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

## డ్రోన్స్ సాయంతో ట్రాఫిక్ కంట్రోల్



విజయవాడ, : విజయవాడ ట్రాఫిక్ పోలీస్ శాఖ టెక్నాలజీని వినియోగించడంలో మరో దశలోకి ప్రవేశించింది. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా నగర ట్రాఫిక్ విభాగానికి ఆధునిక పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన 14 డ్రోన్లు, 350 బ్యాటన్ లైట్లు, 720 పోలీస్ క్యాప్స్ అధికారికంగా అందజేశారు. తర్వాత 40 కొత్త ట్రాఫిక్ పాట్రోల్ వాహనాలకు పచ్చజెండా ఊపి సేవలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీజీపీ గుప్తా మాట్లాడుతూ, విజయవాడ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, హెల్మెట్ డ్రైవ్స్, శాంతి భద్రతల పరిరక్షణలో అత్యుత్తమంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ట్రాఫిక్ సిబ్బంది ఎండ, వర్షం, కాలుష్యానికి లోనై సమర్పణతో పనిచేస్తున్న తత్వాన్ని గుర్తించి, వారి సేవలను ప్రశంసించాల్సిందే అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత.. విజయవాడ పోలీసులు ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, నేర నిరోధంలో, ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఆయన డ్రోన్ల పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. విజయవాడ నగరం ఇప్పటికే "అస్త్రామ్" అనే ఎఆర్ ఆధారిత వ్యవస్థను విజయవంతంగా ప్రయోగించిందని, విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దాన్ని వినియోగించారని వివరించారు. ఈ విజయవంతమైన మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు. విజయవాడ తరహా ఇతర నగరాల్లోనూ త్వరలో.. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కనీసం ఒక డ్రోన్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వీటిని నిఘా, రక్షణకోసం వినియోగిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు తెలిపారు. సీసీటీవీలు, డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలను విరాళంగా అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్నాలజీ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు, నేరగాళ్లను వేగంగా గుర్తించగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖకు సంబంధించిన దృక్పథం మారిందని, ప్రజల భద్రతకు టెక్నాలజీ సహకారంతో మరింత సమర్థవంతంగా స్పందించగలుగుతున్నామని అధికారులు పేర్కొన్నారు. విజయవాడ తరహా మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ త్వరలో అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

## డీ ఏ ఓ రైతుల సంక్షేమానికి కృషి చేశారు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్ 11: జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్ మరణం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వీరు నాయక్ సంతాప సభ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వీరునాయక్ నెల రోజుల నుండి హైదరాబాద్ లోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారని తెలిపారు.వీరు నాయక్ నిజాయితీ గల అధికారి అని, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మంచి అధికారిని కోల్పోయామని అన్నారు. వీరునాయక్ సేవలు వ్యవసాయ రంగానికి ఎంతో మేలు కలిగించాయన్నారు. ఆయన మృతి వ్యవసాయ శాఖకు తీరని లోటని పేర్కొంటూ వీరు నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ జిల్లా యంత్రాంగం తరఫున వీరునాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ఇంఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా ర్యాలీపై బీజేపీ ఆగ్రహం

- జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్.
- మానవత్వం కాదు.. మత-ఓటు రాజకీయాలే
- పిల్లలను ర్యాలీల్లో వాడటం
- జాతీయ జెండాకు అవమానం
- మత రాజకీయాలకు చివరి హెచ్చరిక

బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఘాటు వ్యాఖ్యలు





ఖమ్మం బ్యూరో ఆగస్టు 11: పాలస్తీనా సంఘీభావం పేరుతో ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీపై బీజేపీ ఘాటుగా స్పందించింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో భాజపా నేతలు సోమవారం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు సమర్పించారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులను అనుమతి లేకుండా పాల్గొనిపించడం, జాతీయ జెండాతో పాటు విదేశీ జెండాలను ఊపించడం, మతపరమైన భావజాలాన్ని పిల్లల మదిలో నింపే ప్రయత్నం చేయడం దేశ హితానికి విరుద్ధమని, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో, ఇటీవల జరిగిన ర్యాలీకి సంబంధించిన అన్ని సంఘటనలను బీజేపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, మానవత్వం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు ఆడటాన్ని ఖమ్మం ప్రజలు ఇక సహించబోరని హెచ్చరించారు. గాజా కోసం, పాలస్తీనా కోసం మీరు రోడ్లపై వేల ర్యాలీలు చేస్తారని, కానీ ఖమ్మం ప్రజల బాధలకు మాత్రం ఎప్పుడూ మౌనం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు. 2023లో కాల్వట్టులో జరిగిన దారుణాన్ని గుర్తు చేస్తూ, ఒక హిందూ యువకుడిని ముస్లిం దుండగులు పెట్రోల్ పోసి మంటగలిపి హతమార్చిన సంఘటనపై ఒక్క స్పందన కూడా రాలేదని, రెండు నెలల క్రితం రైల్వే స్టేషన్ వద్ద 50 మంది ముస్లిం యువకులు టీ స్టాల్ యజమానిపై దాడి చేసినప్పుడు కూడా ఎటువంటి ఆందోళన కనిపించలేదని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో గాజా కోసం రాత్రింబగళ్లు ర్యాలీలు, ప్రెస్ మీట్లు, మీడియా కవరేజీలు నిర్వహించగలిగితే, ఇక్కడి ప్రజల బాధలపై మౌనం ఎందుకు అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.సాయి గణేష్ నగర్ లవ్ జిహాద్ కేసు, తుమ్మలగడ్డలో మహిళలపై బెదిరింపులు, నరసింహ స్వామి ఆలయంలో దళిత మహిళపై వేధింపులు, ముష్టికుంట, కోడుమూరులో హిందూ మహిళలపై గంజాయి దాడులు– ఈ అన్నీ జరిగినా కూడా, మానవత్వం పేరుతో గొంతు విప్పిన వారంతా మౌనమే వహించారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ సైనికుల త్యాగాలను గుర్తు చేసే ఆపరేషన్ సింధూరు విజయోత్సవ ర్యాలీలో కూడా ఈ నేతలు కనబడకపోవడం వారి అసలు మనసును బహిర్గతం చేస్తోందని వ్యాఖ్యానించారు. కాశ్మీర్‌లో మతం పేరుతో 27 మంది హిందువులను ఉగ్రవాదులు హతమార్చిన ఘటనపై కూడా ఈ నాయకులు నోరు విప్పకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కోటేశ్వరరావు పేర్కొన్నారు. పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే పాలస్తీనాను సమర్థిస్తూ, మన దేశానికి సహాయం చేసిన ఇజ్రాయిల్‌ను విమర్శించడం దేశభక్తి కాదని ఆయన ఎద్దేవా చేశారు. ర్యాలీలో పాఠశాల విద్యార్థులను కిలోమీటర్ల తరబడి నడిపించడం, జాతీయ జెండాకు సమానంగా విదేశీ జెండాలను పట్టించడం, పిల్లలకు వేషధారణలు చేయించడం దేశ ప్రతిష్టకు మచ్చగించడమేనని ఆయన ఆరోపించారు. ముస్లిం ఓటు బ్యాంకును కాపాడేందుకు హిందూ బాధలపై మౌనం వహించే ఈ రాజకీయ మోసాన్ని ప్రజలు బహిర్గతం చేస్తున్నారని స్పష్టం చేశారు. మతం చూసి మానవత్వం అమ్ముకునే ఈ మాయాజాలం ఇక చెల్లదని, జాతీయ సమస్యలపై మౌనం పాటిస్తూ, గాజా కోసం గొంతు విప్పడం ప్రజలతో మోసం చేయడమే నని ఆయన ఘాటు హెచ్చరిక జారీ చేశారు. అనంతరం ఖమ్మం నగర ఎసిపి రమణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటేల విద్యాసాగర్, సన్నీ ఉదయ ప్రతాప్, దేవకి వాసుదేవరావు, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, మంద డపు సుబ్బారావు,నల్లగట్టు ప్రవీణ్ కుమార్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు,ఆర్ వి ఎస్ యాదవ్, ఈదుల భద్రం , వేల్పుల సుధాకర్, రజినీ రెడ్డి, శ్రీరామనేనిమణి, తదితరులు పాల్గొన్నారు.

## వీధుల్లో కుక్కలు వద్దు..

# వెంటనే తరలించండి

### సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు

- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కల తరలింపునకు సుప్రీం ఆదేశం
- అడ్డుకునే వారిపై కఠిన చర్యలని హెచ్చరిక
- నివాస ప్రాంతాలను కుక్కలు లేకుండా చేయాలని స్పష్టీకరణ
- తరలింపును ఆపేందుకు దత్తతలకు అనుమతి లేదు
- షెల్టర్ల నుంచి కుక్కలను తిరిగి వదలొద్దని హుకుం
- పెరిగిపోతున్న కుక్కకాటు, రేబిస్ మరణాలపై ఆందోళన



ఢిల్లీ: వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని నివాస ప్రాంతాల నుంచి వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని, ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని సోమవారం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని, కోర్టు ధిక్కరణగా పరిగణిస్తామని హెచ్చరించింది. పెరిగిపోతున్న కుక్కకాటు ఘటనలు, రేబిస్ మరణాలపై వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. "ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయం. ఇందులో ఎలాంటి భావోద్వేగాలకు తావులేదు. తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీధి కుక్కల సమస్యపై కేవలం కేంద్ర ప్రభుత్వం వాదనలు మాత్రమే వింటామని, జంతు ప్రేమికులు లేదా ఇతర సంస్థల పిటిషన్లను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని మున్సిపల్ అధికారులు తక్షణమే ప్రత్యేక డాగ్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. కుక్కలను పట్టుకోవడం, స్టెరిలైజేషన్, టీకాలు వేయడంలో శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాలని సూచించింది. షెల్టర్ల నుంచి కుక్కలు తప్పించుకోకుండా సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, కుక్కకాటు ఘటనలపై ఫిర్యాదుల కోసం వెంటనే హెల్ప్‌లైన్ ప్రారంభించాలని స్పష్టం చేసింది. అవసరమైతే ఈ పని కోసం ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. గతంలో కుక్కల తరలింపు కోసం ఒక స్థలాన్ని గుర్తించగా, జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ తెచ్చారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "కొంతమంది జంతు ప్రేమికుల కోసం మన పిల్లలను బలివ్వలేం" అని వ్యాఖ్యానించింది. తరలింపును అడ్డుకునే ఉద్దేశంతో వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. షెల్టర్లకు తరలించిన ఏ ఒక్క కుక్కను కూడా తిరిగి వీధుల్లోకి వదలకూడదని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కోర్టు హెచ్చరించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య ఢిల్లీలో 49 రేబిస్ కేసులు, 35,198 కుక్కకాటు ఘటనలు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పరిస్థితి తీవ్రంగా ఉందని, తక్షణ చర్యలు అత్యవసరమని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# విద్యార్థినుల రక్షణగా షీ టీమ్

ఆకతాయిలను అరికట్టడమే షీ టీమ్స్ ఉద్దేశ్యం

మంచిర్యాల జిల్లా షీ టీం ఎస్ఐ ఉష

అండగా ఉంటుంది అని తెలిపిన ఎస్ఐ రాజశేఖర్





మందమర్రి : ఆగస్టు 11 :మందమర్రి పట్టణంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో "షీ టీమ్" ఆవశ్యకతపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తో పాటు మంచిర్యాల షీ టీం ఎస్ఐ ఉష ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంచిర్యాల షీ టీం ఎస్ఐ ఉష మాట్లాడుతూ, మహిళలు, యువతులు, మరియు విద్యార్థినులను వేధింపుల నుండి రక్షించేందుకే షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాపులు, పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో ఉంటూ ఆకతాయిల ఆగడాలను అరికట్టడమే షీ టీమ్స్ ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా, వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఆమె భరోసా ఇచ్చారు.అనంతరం మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో చదువుపై దృష్టి సారించాలని, వారి రక్షణ బాధ్యతను పోలీసులు తీసుకుంటారని అన్నారు. ఆపద సమయంలో నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని, షీ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మందమర్రి పోలీస్ సిబ్బంది, మరియు విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అబద్ధాలు చెప్పి రైతులను ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



చొప్పదండి ని.వ ఆగష్టు 11 : కాంగ్రెస్ పాలనలో రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని బోనస్ అని చెప్పి బోగస్ చేసినారని రైతు రుణమాఫీ పూర్తిగా చేయలేదని అబద్ధాలు చెప్పి రైతులును ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసి అధికారంలోకి వచ్చిందని కరీంనగర్ జిల్లా గంగాధర మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మేన్నేని నవీన్ రావు పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళలకు 2500 తులం బంగారం పెన్షన్ లు 4000 కు పెంచుతామని అనేక అబద్దాలు చెప్పి అందలం ఎక్కి వచ్చిమోసం చేసి కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పాత రోజులు మళ్ళీ తెచ్చినారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు చెరువులలో నీళ్లు ఎండిపోయాయని వచ్చి రాని కరెంటు కష్టాలు అంటే కాంగ్రెస్ పాలనలో ఉందని యూరియ లేక రైతులు లైన్ లో ఉండి అష్టకష్టాలు పడుతున్నారని పేరుకే ప్రజాపాలన గ్రామలాలలో రైతులు ఎవరికీ చెప్పుకో లేకపోతున్నారని తెలిపారు.పరి పాలన చేతకాని దద్దామ్మ ప్రభుత్వం ఉందని తెలిపారు.

## నేడు అంగారక చతుర్దశి

-ప్రత్యేక పూజలందుకొనున్న మంథని మహాగణపతి

-అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అర్చకుడు పల్లి రాము



మంథని ప్రతినిధి, : శ్రావణమాసంలో వచ్చిన అంగారక చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహాగణపతి ఆలయ అర్చకుడు పల్లి రామ్మోహన్ రావు తెలిపారు. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టతతో కూడుకున్నదని అయన తెలిపారు. ప్రతీ నెలలో బహుళపక్షంలో వచ్చే చతుర్దశి తిథి మంగళవారంతో కలిసి వస్తే దానిని అంగారక చతుర్దశిగా పిలుస్తారు.ఈ రోజున భక్తులు గణేశుడిని పూజించి, ఉపవాసం ఉంటారు. కొత్తగా సంకష్టహర చతుర్థి ఉపవాసాలు ఉండాలనికునేవారు ఈరోజు నుండి దీక్షను ప్రారంభిస్తారు. రాత్రి చంద్రుడిని చూసిన తర్వాత ఉపవాసం విరమిస్తారు.హాఇది అడ్డంకులను తొలగించి మరియు జ్ఞానం, శ్రేయస్సు,అదృష్టానికి దేవుడైన గణేశుడికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజని ఆయన తెలిపారు. హాఅంగారక చతుర్దశి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయని. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని అన్నారు.

# రైతులను బలోపేతం చేసే దిశగా పటిష్ట చర్యలు

-రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

-గ్రీన్ ఎనర్జీ పాలసీ క్రింద పెద్దపల్లి జిల్లాలో పిఏసిఎస్ ద్వారా 4 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి

-4 నెలల కాలంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ పనులు పూర్తి

- గుంజపడుగు గ్రామంలో 2 కోట్ల 90 లక్షలతో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు





మంథని ప్రతినిధి, ఆగస్టు 11: రైతులను బలోపేతం చేసే దిశగా సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం మంథని మండలంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, కరీంనగర్ డిసిసిబి చైర్మన్ రవీందర్ రావు లతో కలిసి మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వేరు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 7 కోట్ల రూపాయలతో 5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న రెండు గోదాములకు, గుంజపడుగు గ్రామంలో 2 కోట్ల 90 లక్షల రూపాయలతో పీఎం కుసుమ్ ద్వారా ప్యాక్స్ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని ఆధ్వర్యంలో గుంజపడుగు శివారులో పి.ఎం కుసుమ్ క్రింద 3.5 కోట్ల రూపాయలతో 1 మెగా వాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మన పెద్దపల్లి జిల్లాలో నంది మేడారం, కాల్వ శ్రీరాంపూర్, అప్పన్న పేట, మంథని ప్రాంతాలలో 1 మెగా వాట్ చొప్పున ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 4 నెలల కాలంలో ఈ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం, గ్రిడ్ కనెక్షన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. చిల్లపల్లి గ్రామంలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము లను 7 కోట్ల రూపాయలతో చేపట్టామని అన్నారు. గుంజపడుగు ప్రాంతంలో సహకార బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆర్.బి.ఐ కు పంపాలని మంత్రి సూచించారు. సహకార శాఖ లో 20 సంవత్సరాల కాలంగా తన వంతు కృషి చేస్తున్న కరీంనగర్ డిసిసిబి చైర్మన్ కు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే రైతు సోదరులకు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాలతో పాటు అనుబంధ రంగాలైన గోదాముల నిర్మాణం, పి.ఏ.సి.ఎస్ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు నువ్వంటే కార్యక్రమాల వల్ల రైతులను బలోపేతం చేయడం జరుగుతుందని అన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్థానిక ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, విద్యుత్ నియంత్ర మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే,ఆర్డిఓ సురేష్, తహసిల్దార్ కుమారస్వామి, ఎంపిడిఓ శశికళ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.